సాక్షి
ఖమ్మం
మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



మామిడి.. లేదు రాబడి...
తొలినాళ్లలో తెగుళ్లు.. ఇప్పుడు గాలిదుమారంతో మామిడి కాయలు నేలరాలుతుండగా రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. 8లో



సభకు తరలిరావాలి..
ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు పిలుపునిచ్చారు. 8లో

గరిష్టం / కనిష్టం
39° / 25°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఎండ తీవ్రత ఉంటుంది. ఉదయం నుంచే ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతూ మధ్యాహ్నంకల్లా గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదులు పరిష్కరించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్వో పద్మశ్రీ

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించే ప్రతీ దరఖాస్తును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆమె డీఆర్‌డీఓ సన్యాస్యతో కలిసి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై డీఆర్వో.. దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఆర్‌టీఓ వెంకటరమణ

ఖమ్మంక్రైం: కొంతకాలంగా సెలవులో ఉన్న ఖమ్మం ఎంవీఐ, ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వెంకటరమణ సోమవారం విధుల్లో చేరారు. ఇంతకాలం వైరా ఎంవీఐ వరప్రసాద్ ఇన్‌చార్జ్ ఆర్‌టీఓగా వ్యవహరించారు. ఈ మేరకు విధుల్లో చేరిన అనంతరం వెంకటరమణ రవాణాశాఖ ఉద్యోగులతో సమావేశమై త్రైమాసిక పన్నుల వసూళ్లు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలపై సూచనలు చేశారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన డీఆర్‌ఎం



డీఆర్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మధిర: మధిర రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం భర్తేష్ కుమార్ జైన్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా పనుల్లో వేగం పెంచడమే కాక నాణ్యతగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కాగా, అఖిలపక్షం నాయకులు సూరంశెట్టి కిషోర్, మందా సైదులు, బెజవాడ రవిబాబు తదితరులు డీఆర్‌ఎంను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మధిరలో రైల్వే అండర్ పాస్ నిర్మించాలని, అప్పటివరకు రైల్వేగేట్ వద్ద రాకపోకలకు అనుమతించడమే కాక గౌతమి, సింహపురి, నవజీవన్ రైళ్ల హాల్టింగ్ ఇప్పించాలని కోరారు.

వచ్చేనెలలో ఉపాధ్యాయులకు శిక్షణ?

ఖమ్మం సహకారనగర్: ఇటీవల చేపట్టిన వివిధ సర్వేల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కొందరు పలు అంశాల్లో వెనుకబడినట్లుగా తేలింది. ఈనేపథ్యాన సబ్జెక్టు ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలు పెంచేందుకు వేసవి సెలవుల్లో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా 30వ తేదీలోగా రిసోర్స్‌పర్సన్ల ఎంపిక పూర్తి చేశాక.. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ)లో శిక్షణ ఇస్తారని సమాచారం. ఆపై వీరి ద్వారా మే నెలలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

మార్కెట్ల ద్వారా లక్ష్యానికి మించి ఆదాయం



మిర్చిని పరిశీలిస్తున్న డీడీ పద్మావతి

ఏన్కూరు: వరంగల్ రీజియన్ పరిధి వ్యవసాయ మార్కెట్ల ద్వారా లక్ష్యానికి మించి ఆదాయం వస్తోందని మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి తెలిపారు. ఏన్కూరులోని వ్యవసాయ మార్కెట్‌ను సోమవారం తనిఖీ చేసిన ఆమె మిర్చి కొనుగోళ్లు, జెండా పాట, నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం డీడీ మాట్లాడుతూ గత ఏడాది మార్కెట్ల ద్వారా రూ.449 కోట్ల లక్ష్యానికి గాను రూ.458 కోట్ల ఆదాయం నమోదైందని తెలిపారు. మార్కెట్లతో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే కాక పంటలకు మద్దతు ధర లభించేలా ఉద్యోగులు పర్యవేక్షించాలని సూచించారు. మార్కెట్ కార్యదర్శి బజార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పంట పండాల్సిందే..



వైరా రిజర్వాయర్ కింద వరి నారుమడిలో రైతులు (ఫైల్)

ఖరీఫ్ సాగు ప్రణాళిక ఖరారు
- అన్ని పంటలు కలిపి 7.32 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- ఇందులో వరి 2.95 లక్షలు, పత్తి 2.13 లక్షల ఎకరాలు
- విత్తనాలు, ఎరువులు సమకూర్చడంపై కసరత్తు

ఖమ్మంవ్యవసాయం: రానున్న ఖరీఫ్ కాలానికి సాగయ్యే పంటల ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. జిల్లాలోని నీటి వనరులతో పాటు నేలలు, వాతావరణం ఆధారంగా పంటల సాధారణ సాగు విస్తీర్ణాన్ని రూపొందించింది. వరి, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, కందులు, పెసలు, మినుము, వేరుశనగ, నువ్వులు, పత్తి పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుకు అవకాశం ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలోని 21మండలాల్లో 7,32,509.619 ఎకరాలు సాగుకు అనువుగా ఉన్నాయని నివేదిలో పేర్కొన్నారు. ప్రధానంగా వరి 2.95 లక్షల ఎకరాల్లో, పత్తి 2.13 లక్షల ఎకరాల్లో, మిర్చి 71వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. వరిలో వచ్చే ఖరీఫ్‌లోనూ సన్నరకాలే ఎక్కువగా సాగవుతాయని భావిస్తున్నారు.

64,308 క్వింటాళ్ల విత్తనాలు

వచ్చే ఖరీఫ్‌లో సాగయ్యే పంటలకు 64,308 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ ప్రణాళికలో పొందుపర్చింది. ఇందులో 59,020 క్వింటాళ్లు వరి విత్తనాలు ఉండగా, తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా సమకూర్చడంపై దృష్టి సారించనున్నారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఇప్పటికే వరి, పెసర తదితర పంటల విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రస్తుతం సాగు ప్రణాళిక ఖరారవడంతో వ్యవసాయ శాఖ ఇచ్చే జాబితా ఆధారంగా విత్తనాలను సిద్ధం చేయనున్నారు.

ఎరువులపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో పంటలు సాగు చేసే రైతులకు ఎంత మేర ఎరువులు అవసరమో కూడా నివేదిక సిద్ధం చేశారు. మూడో రైల్వే లైన్ నిర్మాణంతో ఖమ్మంలో ఉన్న రేక్ పాయింట్‌ను చింతకాని మండలం పందిళ్లపల్లికి ఇటీవల మార్చారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమై సరిపడా ఎరువులు సమకూర్చేలా దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పంటల సాగుకు 1.96 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇందులో ప్రధానంగా యూరియా 1.20 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమని చెబుతున్నారు.



కొన్ని పంటల విత్తన ప్రణాళిక (క్వింటాళ్లలో)

పంట	విత్తనాలు
వరి	59,020
పత్తి	3,040
పెసర	1,423
మొక్కజొన్న	614
మినుము	93
మిరప	71

ప్రణాళికాయుతంగా అంచనాలు



ఖరీఫ్ పంటల ప్రణాళిక రూపొందించాం. అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఇప్పటికే విత్తనాలు సిద్ధం చేస్తోంది. ఇక మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను అందుబాటులోకి తీసుకొస్తాం.
– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

ఎరువుల వివరాలు

ఎరువు	మె. టన్నుల్లో
యూరియా	1,20,904.512
డీఏపీ	41,719.321
ఎంఓపీ	34,800.310

ప్రధాన పంటల సాగు విస్తీర్ణం అంచనా (ఎకరాల్లో)

వరి	పత్తి	మిరప	ఆయిల్‌పామ్	మామిడి	పెసర	మొక్కజొన్న	మినుము	నిమ్మ జాతి
2,95,100.020	2,13,350.196	71,245.190	25,418.121	32,091.977	17,790.584	6,135.772	1,165.328	1,399.673

ప్రపంచానికి నాయకత్వం వహించాలి



యువతికి అపాయింట్‌మెంట్ లెటర్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ, సింగరేణి జీఎం షాలేం రాజు

- ఇండస్ట్రియల్ పార్క్‌తో మధిరకు ఉజ్వల భవిష్యత్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- జాబ్‌మేళాలో 2,325 మంది ఎంపిక

మధిర: మధిర నియోజకవర్గంలో వ్యవసాయదారులే ఎక్కువగా ఉన్నందున వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించేలా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేశామని.. తద్వారా నియోజకవర్గానికి మంచి భవిష్యత్ ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. నియోజకవర్గ యువతీ, యువకులు ప్రపంచానికి నాయకత్వం వహించేలా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మధిరలో సోమవారం ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాను భట్టి ప్రారంభించారు. తొలుత వివిధ కంపెనీల స్టాళ్లను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా అగ్రికల్చర్ పాలిటెక్నిక్, జనరల్ పాలిటెక్నిక్ కళాశాలు ఉండగా.. ఐటీఐని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను యువత గుర్తించి భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించాలని సూచించారు. అయితే, జాబ్‌మేళాలో వచ్చిన ఉద్యోగం చేస్తూనే మెరుగైన లక్ష్యాల సాధనకు కృషి చేయాలని తెలిపారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ ఎవరికి వారు నమ్మకంతో ముందుకు సాగితే విజయం సొంతమవుతుందని తెలిపారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

97 కంపెనీలు.. వేలాది మంది యువత

మధిరలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో సింగరేణి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో 97 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈమేరకు 5,287 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 3వేల మందికి పైగా హాజరయ్యారు. ఎస్సెస్సీ మొదలు ఎంటెక్ చదివిన అభ్యర్థులను ఇంటర్వ్యూ ఆధారంగా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 2,325 మందిని ఎంపిక చేయగా కొందరికి డిప్యూటీ సీఎం నియామక పత్రాలు అందజేశారు. మరికొందరికి హైదరాబాద్‌లో తుది దశ ఇంటర్వ్యూల అనంతరం నియామకపత్రాలు ఇస్తామని ప్రతినిధులు తెలిపారు. చదువు పూర్తిచేసి ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్న పలువురికి ఉద్యోగాలు లభించడంతో సంతోషం వ్యక్తం చేశారు. కాగా, మధిరకు చెందిన సముద్రాల ప్రియాంకకు రూ.4 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం రావడం విశేషం.



పేర్లు నమోదు చేసుకుంటున్న నిరుద్యోగులు

ఊహించని ఉద్యోగమిది...



పాలిటెక్నిక్ పూర్తిచేశాను. స్నేహితులతో కలిసి జాబ్‌మేళాకు హాజరైనా ఉద్యోగం ఊహించలేదు. కానీ ఎంపవర్ సర్వీసెస్‌లో రూ.3లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపిక చేసి నియామకపత్రం ఇచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో ఈ ఉద్యోగం దక్కింది.
– బి.ఉషారాణి, వంగవీడు

అపాయింట్‌మెంట్ లెటర్ కూడా..



జీఎన్‌ఎం చదువుతున్నా. జాబ్ మేళాలో ప్రీమియర్ హెల్త్ కేర్ సొసైటీలో ఉద్యోగానికి ఎంపికయ్యా. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన నాకు ఉద్యోగం రావడంతో కుటుంబానికి అండగా నిలిచే అవకాశం దక్కింది. ఏటా రూ. 3లక్షల ప్యాకేజీతో లేఖ ఇచ్చారు.
– డి.తిరుపతమ్మ, వంగవీడు

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల నేపథ్యాన భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) నిర్దేశించిన ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాల్లో నాణ్యత పరీక్షించకుండా ధాన్యం కొనుగోలు చేస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈక్రమాన వ్యవసాయ విస్తరణ అధికారి నిర్ధారించాలని తెలిపారు. కాగా, నాణ్యతను పరీక్షించాలకే మిల్లులకు ధాన్యం పంపిస్తున్నందున మిల్లర్లు తరుగు తీయొద్దని సూచించారు. రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్లు విజయ్‌బాబు, సత్యనారాయణ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో బోనస్ నగదు

జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతుండగా, సన్నధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో మద్దతు ధరకు తోడు బోనస్ కూడా జమ అవుతోంది. జిల్లాలోని తల్లాడ, కల్లూరు, నేలకొండపల్లి, కూసుమంచి మండలాలకు చెందిన 385మంది రైతులు 29,056క్వింటాళ్ల సన్న రకం ధాన్యం విక్రయించారు. వీరికి రూ.14,52,800 బోనస్ జమ అయిందని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు.

ఆలయాల అప్‌గ్రేడ్..

- కొన్నింటికి 6బీ నుంచి 6ఏ హోదా
- మరికొన్ని 6బీ జాబితాలోకి..

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలను అప్‌గ్రేడ్ చేస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. భక్తుల తాకిడితో పాటు అదేస్థాయిలో ఆదాయం సమకూరుతోంది. దీంతో ప్రతీ మూడేళ్లకోసారి ఆలయాల ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుంటున్న దేవాదాయ శాఖ గ్రేడ్ పెంచుతోంది. తద్వారా భక్తులకు ఆలయాల్లో వసతుల కల్పనతో పాటు సిబ్బంది సంఖ్య పెరిగే అవకాశముంటుంది. ఆదాయం ఆధారంగా ఖమ్మం జిల్లాలో ఇప్పటికే ఏడు ఆలయాలకు 6ఏ హోదా ఉండగా కొత్తగా మరో ఆరింటిని 6బీ నుంచి 6ఏకు అప్‌గ్రేడ్ చేశారు.

6ఏ ఆలయాలు ఇవే..

తాజాగా అప్‌గ్రేడ్ చేసినవి కలిపితే ఉమ్మడి జిల్లాలో మొత్తం 17ఆలయాలు 6ఏ గ్రేడ్ పరిధిలో ఉన్నాయి. ఇందులో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం, పాల్వంచ మండలంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం, అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తగూడెంలోని శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయంతో పాటు జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి, ఖమ్మంరూరల్ మండలం రెడ్డిపల్లి శ్రీమారెమ్మతల్లి ఆలయం, పెనుబల్లిలోని శ్రీనీలాద్రీశ్వరస్వామి, ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి(గుట్ట), కమాన్‌బజార్ శ్రీ వేంకటేశ్వరస్వామి, కాల్వొడ్డులోని సత్యనారాయణ సహిత వీరాంజయనేయస్వామి, వేంసూరు మండలం కందుకూరు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఈ జాబితాలో కొనసాగుతున్నాయి. కొత్తగా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల సంగమేశ్వరస్వామి, మధిరలోని మృత్యుంజయస్వామి, ఖమ్మంలోని శ్రీ గుంటుమల్లేశ్వరస్వామి, ఏన్కూరు మండలం గార్లొడ్డు శ్రీలక్ష్మీనర్సింహస్వామి, సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలోని శ్రీ కోటమైసమ్మ తల్లి, ఖమ్మం ఇందిరానగర్ శ్రీ సీతారామచంద్రస్వామి(పర్ణశాల) ఆలయాలు అప్‌గ్రేడ్ అయ్యాయి. అలాగే, ముదిగొండ మండలం వల్లాపురం శ్రీ మల్లికార్జునస్వామి, కొణిజర్ల మండలం పల్లిపాడు శ్రీ శంభులింగేశ్వరస్వామి, కూసుమంచి మండలం పెరికసింగారం శ్రీవేణుగోపాల ఆంజనేయస్వామి, ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్ శ్రీ సీతారామాంజనేయ స్వామి, కామేపల్లి మండలం కొత్తలింగాల కోట మైసమ్మ, ఖమ్మం వరదయ్యనగర్‌లోని మైసమ్మ ఆలయాలు 6బీ హోదా పొందాయి. భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి శ్రీదాసాంజనేయస్వామి, కొత్తగూడెం బాబూక్యాంప్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి, పాపకొల్లు శ్రీఉమాసోమలింగేశ్వరస్వామి, పాల్వంచలోని శ్రీరామాలయం, అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయాలకు కూడా 6బీ హోదా కల్పించారు.



6ఏ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్ అయిన కొత్తలింగాలలోని శ్రీ కోటమైసమ్మ తల్లి ఆలయం

భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- అందుకోసమే అమల్లోకి భూ భారతి చట్టం
- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

ఖమ్మంరూరల్: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వెబ్‌సైట్ ద్వారా భూసమస్యలకు పరిష్కారం లభించకపోగా, రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రస్తుత ప్రభుత్వం అన్ని సమస్యలను పరిష్కరించేలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ధరణితో భూ సమస్యలు పరిష్కారం కాకపోగా.. కొత్త చిక్కులు ఎదురయ్యాయన్నారు. ఈనేపథ్యాన సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిపుణులతో చర్చించి భూ భారతి చట్టానికి రూపకల్పన చేశారని తెలిపారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ మ్యుటేషన్, ఇనాం భూములు, భూ టైటిళ్లకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీఓ నరసింహారావు, డీఏఓ పుల్లయ్య, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఏడీఏ సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి అభివృద్ధికి సహకారం

ఖమ్మంవైద్యవిభాగం: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న ఖమ్మం జనరల్ ఆస్పత్రి అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు సహకరిస్తానని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి ఎంపీ లాడ్స్ నిధులు రూ.8లక్షలతో కేటాయించిన ఎనిమిది ఫ్రీజర్లను అందించడంతో పాటు వైద్యాధికారుల విజ్ఞప్తితో రెండు బోర్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పాత భవనం మరమ్మతుల కోసం నిధుల కేటాయింపునకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ బాబు రత్నాకర్, డాక్టర్ బి.కిరణ్, నందగిరి శ్రీనుతో పాటు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్, మిక్కిలినేని నరేందర్, ముస్తఫా, లింగాల రవికుమార్, మియా భాయ్, కాంపాటి వెంకన్న, మజీద్, ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ పాల్గొన్నారు.

హైవేల నిర్మాణంలో వేగం

ఖమ్మంఅర్బన్: పీఎంజీఎస్‌వై, ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న జాతీయ రహదారులు, వంతెనల నిర్మాణంలో వేగం పెంచాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అధికారులతో సమావేశమై రహదారుల నిర్మాణ పురోగతిపై ఆరా తీశాక సర్వీస్ రోడ్లు, ఇతర అంశాలపై సూచనలు చేశారు. పీఆర్ ఈఈ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆతర్వాత ఖమ్మం రూరల్ మండలం పాన్నెకల్ బ్రిడ్జి నుంచి కోదాడ మార్గంలో ధంసలాపురం వరకు, అగ్రహారం రైల్వే వంతెన నిర్మాణ ప్రాంతంలో ఎన్‌హెచ్‌ఏఐ పీడీ దివ్యతో కలిసి ఎంపీ పరిశీలించారు. మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథ్‌బాబు, నాయకులు కల్లెం వెంకటరెడ్డి, కొప్పుల చంద్రశేఖర్, బ్రహ్మారెడ్డి, తమ్మినేని నవీన్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ నర్సింహారావు, ఏడీఏ సరిత, తహసీల్దార్ రాంప్రసాద్ తదితరులు

నీరు పారేదాక పని ఆగొద్దు

ఫ్లడ్‌లైట్ల వెలుగులో మంచుకొండ 'లిఫ్ట్' పనులు

ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెం మండలంలోని సాగు భూములకు సాగర్ జలాలు అందించాలనే లక్ష్యంతో మంచుకొండ వద్ద ప్రధాన కాల్వపై నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.65 కోట్ల అంచనాలతో నిర్మించే ఈ పథకం పనులు త్వరగా పూర్తిచేసి ట్రయల్ రన్ నిర్వహించాలనే లక్ష్యంతో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రాత్రింబవళ్లు చేపడుతున్నారు. ఈ సీజన్‌లోనే మండలంలోని చెరువులకు సాగర్ జలాలు విడుదల చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడమే కాక, పనుల్లో వేగం పెరిగేలా తరచూ సమీక్షిస్తున్నారు. అయితే ప్రధాన పైప్‌లైన్, పంపుహౌస్, ఇతర పనులు చివరి దశకుచేరినా మోటార్లు ఇప్పటికిప్పుడు సమకూర్చడం సాధ్యం కాదని కంపెనీ బాధ్యులు చెప్పినట్లు తెలిసింది. దీంతో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి అదనంగా ఉన్న మోటార్లను రెండు రోజుల క్రితం తెప్పించగా వీటిని బిగించే పనులు సోమవారం మొదలయ్యాయి. ఈనెల 24 లేదా ఆ తర్వాత ఒకటి, రెండు రోజుల్లో సాగర్ జలాల ఎత్తిపోతల ట్రయల్ రన్ చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఇంజనీర్లు చెబుతున్నారు.



ఫ్లడ్‌లైట్లు వెలుతురులో కొనసాగుతున్న పైప్‌లైన్ పనులు



పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వద్ద నుంచి తెప్పించిన మోటార్

క్లుప్తంగా

విద్యుత్ సమస్యలపై నేడు 'ఫోన్ ఇన్'

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధిత సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మంగళవారం ఫోన్ ఇన్ నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. సరఫరాలో అంతరాయాలు, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 94408 11525 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కోర్టు ముఖ్య పరిపాలనా అధికారి బదిలీ

ఖమ్మంలీగల్: జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారి పి.హరికృష్ణ సికింద్రాబాద్ ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న సంజయ్ షేట్కర్‌ను ఖమ్మంకు కేటాయించారు. అలాగే, ఖమ్మం కోర్టులో పనిచేస్తున్న బి.మల్లికార్జున రావు బోధన్ ఐదో అదనపు జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారిగా బదిలీ కాగా.. రంగారెడ్డి జిల్లా ప్రధాన కోర్టులో పనిచేస్తున్న పి.గోపాలకృష్ణను ఈ స్థానంలో నియమించారు.

ఆర్‌పీల నియామకానికి దరఖాస్తులు

ఖమ్మంసహకారనగర్: మండల,జిల్లాస్థాయిలో రిసోర్స్ పర్సన్లు (ఆర్‌పీ)లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో సూచించారు. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను ఈ నెల 24వ తేదీలోగా తమ కార్యాలయంలో అందించాలని తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యాన కమిటీ ద్వారా రిసోర్స్ పర్సన్ల ఎంపిక ఉంటుందని వెల్లడించారు.

గాంధీపురం రైల్వేగేట్‌లో సాంకేతిక లోపం



రైల్వేగేట్ వద్ద మరమ్మతులు చేస్తున్న రైల్వే సిబ్బంది

కారేపల్లి: మండలంలోని ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై గాంధీపురం వద్ద రైల్వేగేట్ సోమవారం సాంకేతిక లోపంతో తెరుచుకోలేదు. దీంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సుమారు గంట పాటు గేట్ మూతపడి ఉండడంతో, ఉద్యోగులు అతి కష్టంపై మరమ్మతులు చేపట్టారు. అయితే, గాంధీపురంతో పాటు, కారేపల్లిలోని ఇల్లెందు రైల్వేగేట్, పేరుపల్లి గేట్ల మీదుగా వాహనాల రద్దీ ఉంటుంది. ఇక్కడ ట్రాక్‌పై ప్రతీ 20 నిమిషాలకో గూడ్స్ వచ్చి వెళ్తుండడం.. ఆ సమయాన గేట్లు మూసివేయడం.. తరచుగా సాంకేతిక లోపంతో తెరుచుకోక వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఫ్లైఓవర్ లేదా అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

20 రోజులు.. 673 మంది

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులు

ఖమ్మంక్రైం: ఈ నెలలో ఇప్పటివరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 673 మంది పట్టుబడ్డారని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 21 మంది మైనర్లపై కేసులు నమోదు చేశామని వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వారు ప్రాణాలు కోల్పోవడమే కాక ఇతరులు ప్రమాదాల బారిన పడడానికి కారకులవుతారని తెలిపారు. ఈ మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన పలువురికి న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్ష లేదా జరిమానా విధించినట్లు చెప్పారు. మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీపీ సునీల్‌దత్ వివరించారు.

25న జిల్లా జైలులో బహిరంగ వేలం

ఖమ్మంరూరల్: జిల్లా జైలులో పనికిరాని ఇనుప వస్తువులను విక్రయించేందుకు ఈ నెల 25న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేలం జరుగుతుందని, ఆసక్తి ఉన్న వారు రూ.5 వేల ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. వేలంలో సామగ్రి దక్కించుకున్న వారు 18 శాతం జీఎస్టీతో కలిపి నగదు చెల్లించి వస్తువులు తీసుకెళ్లాలని తెలిపారు. వివరాలకు జైలర్లు ఎ.సక్రూనాయక్ (94946 32552), జి.లక్ష్మీనారాయణ(97005 05151)ను సంప్రదించాలని సూపరింటెండెంట్ సూచించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,060	2,060
పెసలు	7,000	4,500
కందులు	6,800	3,000
మినుములు	6,800	6,800
మిర్చి	13,500	6,000
మిర్చి తాలు	5,900	4,200
పత్తి	7,400	5,000

– ఖమ్మం వ్యవసాయం

మామిడి.. లేదు రాబడి..

మామిడి రైతులకు దెబ్బ మీద దెబ్బ

- తొలుత తెగుళ్లు.. ఇప్పుడు గాలిదుమారం, అకాల వర్షం
- కోత సమయాన కాయలు నేలరాలడంతో తీవ్ర నష్టం
- నాణ్యత తగ్గి పడిపోతున్న ధర



గాలి దుమ్ముకు రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న రైతు

తల్లాడ: ఈ ఏడాది మామిడి రైతులకు దెబ్బ మీద దెబ్బ తగిలింది. కోలుకోలేని నష్టం వాటిల్లింది. సాధారణంగా మేలో చెడు గాలులు, వానలు వస్తాయి. ఈసారి ఏప్రిల్ మొదటి వారం నుంచే అకాల వర్షం, గాలిదుమ్ములు వచ్చాయి. దీంతో మామిడి రైతులు తీవ్రంగా నష్ట పోయారు. కోతకొచ్చిన తరుణంలో అకాల వర్షం, పెను గాలుల కారణంగా మామిడి కాయలు నేల రాలాయి. ఈ నెలలో 3, 13, 15, 20 తేదీల్లో రాత్రి గాలి, వాన రావడంతో మామిడి కాయలు నేలరాలాయి. నాలుగు సార్లు గాలి, వాన రావడంతో కోసేందుకు సిద్ధంగా ఉన్న మామిడి కాయల్లో 30 నుంచి 40 శాతానికి పైగా కాయలు రాలిపోయాయి. గాలి దుమ్ము రాక ముందు టన్ను రూ.40 వేల నుంచి రూ.60 వేలు పలకగా ప్రస్తుతం రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు టన్ను ధర ఉంది. కాయ నాణ్యతను బట్టి ధర మారుతోంది. ఇక్కడి నుంచి మామిడికాయలను ముంబై, నాగ్‌పూర్, ఢిల్లీ, హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తుంటారు.

సత్తుపల్లిలో అత్యధికం

జిల్లాలో 32 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగవగా.. సత్తుపల్లి నియోజకవర్గంలోనే 20 వేల ఎకరాల్లో తోటలు ఉంటాయి. నెలలో నాలుగు సార్లు వచ్చిన గాలి, వాన కూడా సత్తుపల్లి నియోజక వర్గంలోని కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, తల్లాడ మండలాల్లో ఎక్కువ ప్రభావం చూపటంతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈనెలలో మామిడి కోతలు ప్రారంభమై మే నెలాఖారుతో ముగుస్తాయి. అంతకుముందు అధిక మంచు వల్ల పూత రాలింది. పూత నిల్వడం కోసం రైతులు ఐదు నుంచి పది సార్లు మందులు స్ప్రే చేశారు. తద్వారా ఎకరానికి రూ.20 వేల మేర పెట్టుబడి అయింది. తర్వాత మంగు తెగులు కారణంగా కొంత నష్టం జరిగింది.

కౌలు రైతులకు తీరని నష్టం

ఈ ఏడాది కౌలు రైతులకు తీరని నష్టం జరిగింది. ఎకరానికి రూ.20 నుంచి రూ.30 వేల వరకు కౌలుకు తీసుకోగా కాయలు రాలడంతో కోలుకోలేని దెబ్బ తిన్నారు. 5 ఎకరాల మామిడి తోట కౌలుకు తీసుకున్న వారు రూ.లక్షకు పైగా నష్టపోయారు.

నష్టపరిహారం చెల్లించాలి

గాలి వానతో నష్టపోయిన మామిడి పంట నష్టం అంచనా వేయాలి. నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి. మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది నష్టం వాటిల్లింది. పలుమార్లు గాలి, వాన రావడంతో పలు రకాల కాయలు నేలరాలాయి.

–కోడూరు సత్యనారాయణ, కౌలు రైతు, కిష్టాపురం

అనుకూలించని వాతావరణం



ఈ ఏడాది వాతావరణం మామిడికి అనుకూలించలేదు. కోతల ప్రారంభంలోనే గాలి దుమ్ములతో మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. తీవ్ర నష్టం ఏర్పడింది. మార్కెట్‌లో కూడా టన్ను ధర తగ్గింది. మామిడి రైతులను ఆదుకోవాలి.

–తూము శ్రీనివాసరావు, నూతనకల్

నష్టం అంచనా వేసి పంపించాం



ఈ నెలలోనే మూడు సార్లు గాలి వాన రావడం వల్ల మామిడి పంటకు నష్టం జరిగింది. మామిడి కాయలు నేల రాలడంతో పగిలిపోయి దెబ్బతిన్నాయి. జిల్లాలో 33 శాతానికి పైగా నష్టపోయిన తోటలను ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాం.

–మధుసూదన్, జిల్లా ఉద్యానశాఖాధికారి

పరిహారం ఇప్పించాలని మొక్కజొన్న రైతుల వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, బీకేఎస్ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: మొక్కజొన్న పంట సాగు చేసిన తాము నష్టపోయినా విత్తన కంపెనీ ప్రతినిధులు పరిహారం చెల్లించడం లేదని జిల్లాలోని పలు మండలాల రైతులు వాపోయారు. ఈ సందర్భంగా వారు సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి వినతిపత్రం అందజేశారు. కొణిజర్ల మండలం రామనర్సయ్యనగర్ గ్రామ రైతులు సాగు చేసిన పంటకు రూ.కోటి మేర నగదు చెల్లించాల్సి ఉందని, వేంసూరు మండలంలో దిగుబడి రానందున పరిహారం ఇప్పించాలని కోరారు. అంతేకాక ప్రైవేట్ సీడ్ కంపెనీలు, దళారులపైనా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. బీకేఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగడవరపు శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, నాయకులు తూము అప్పారావు, కొండపర్తి నరేశ్, రైతులు పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ.. నంబర్ మార్చి విక్రయం

రెండు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లతో ఏసీపీ, సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది

పెనుబల్లి: జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేయడమే కాక నంబర్ ప్లేట్లు మార్చి ఇతరులకు అమ్ముతున్నారు. ఇప్పటివరకు 18 బైక్‌లను చోరీ చేసిన వీరు వీఎం బంజర్ పోలీసులకు పట్టుబడ్డారు. వివరాలను వీఎం బంజర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కల్లూరు ఏసీపీ కె.రఘు, సత్తుపల్లి రూరల్ సీఐ ఎంఎల్.ముత్తిలింగయ్యగౌడ్, వీఎం బంజర్ ఎస్‌ఐ కె.వెంకటేశ్ వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట అర్బన్ కాలనీకి చెందిన మక్కెళ్ల నాగరాజు, సత్తుపల్లి మండలం తుంబూరుకు చల్లా శివప్రసాద్ వీఎం బంజర్, సత్తుపల్లి, వేంసూరు, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా పెద్దవేగి స్టేషన్ పరిధిలో రూ.12.45 లక్షల విలువైన 18 ద్విచక్రవాహనాలను చోరీ చేశారు. వీటిలో కొన్నింటి నంబర్ మార్చి పెనుబల్లి మండలం గంగదేవిపాడు, అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం వాసులకు అమ్మగా, వచ్చిన డబ్బుతో జల్సాలు చేశారు. మిగతా వాహనాలను ఎన్ఎస్‌పీ కాలువ పక్కన పొదల్లో దాచి అందులో రెండింటిని అమ్మేందుకు వెళ్తుండగా ఆదివారం సాయంత్రం ఖమ్మం వైపు నుంచి వీఎంబంజర్ వైపు వెళ్లే మార్గంలో చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డారు. ఎలాంటి పత్రాలు లేకపోగా, తడబడుతుండడంతో వాహనాల చాయిస్ నంబర్ ఆధారంగా ప్రశ్నించడంతో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. దీంతో నాగరాజు, శివప్రసాద్‌ను అరెస్ట్ చేయడమే కాక వీరి నుంచి వాహనాలు కొనుగోలు చేసిన పెనుబల్లి మండలం గంగదేవిపాడుకు చెందిన ఓర్సు వెంకటనారాయణ, పందేళ్ల సింహాద్రి, తిరుమలకొండ కొండల్‌రావు, బత్తుల కొండల్‌రావు, అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురానికి చెందిన దేరంగుల నాగసాయి, ఉప్పతాల సతీశ్, ఉప్పతాల గోపి, ఉప్పతాల రాజుపైనా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ రఘు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ వెంకటేశ్, కానిస్టేబుళ్లు శ్రీగాద రాజమల్లు, పి.వెంకటేశ్వర్లు, మోహిద్‌పాషా, బాలకృష్ణ, సురేశ్‌ను ఏసీపీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

ఐదు ఎకరాల సుబాబుల్ తోట దగ్ధం



బోనకల్: ప్రమాదంలో కాలిపోయిన సుబాబుల్ తోట

బోనకల్: మండలంలోని రాయన్నపేట శివార్లలో ఐదెకరాల సుబాబుల్ తోట కాలిపోయింది. గ్రామానికి చెందిన బొమ్మినేని హన్మంతరావు సాగుచేస్తున్న సుబాబుల్ తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోగా, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే రూ.4 లక్షల మేర నష్టం జరిగిందని బాధిత రైతు వెల్లడించాడు.

అగ్ని ప్రమాదంలో ఫర్నిచర్..

నేలకొండపల్లి: నేలకొండపల్లికి చెందిన చింతకాయల సురేశ్ ఇంట్లో సోమవారం హీటర్ ఆన్ చేసి స్విచాఫ్ చేయడం మరిచిపోయారు. దీంతో వేడెక్కి మంటలు వ్యాపించగా వాషింగ్ మిషన్, ఫర్నిచర్ కాలిపోయాయి. మంటలు ఎగిసిపడుతుండటంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో రూ.1.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిసింది.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

బాధితుడు కాంగ్రెస్ నేత, మాజీ వైస్ ఎంపీపీ



ఆత్మహత్యాప్రయత్నాన్ని అడ్డుకుంటున్న స్థానికులు

బోనకల్: నిరుపేద అయిన తనకు అన్ని అర్హతలు ఉన్నా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదనే ఆవేదనతో కాంగ్రెస్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బోనకల్‌కు చెందిన మాజీ వైస్ ఎంపీపీ గుగులోత్ రమేశ్‌కు సొంత ఇల్లు కానీ, పొలం కానీ లేవు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ప్రకటించగా జాబితాలో ఆయన పేరు లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఆదివారం బోనకల్ మీదుగా మధిర వెళ్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు వినతిపత్రం అందించగా పరిశీలించి ఇల్లు మంజూరు చేస్తానని ఆయన తెలిపారు. ఇక సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శిని కలిసి జాబితాపై ఆరా తీశాడు. ఆ తర్వాత జీపీ ముందే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా, స్థానికులు, పోలీసులు, సిబ్బంది ఆయనను అడ్డుకుని నచ్చజెప్పారు.

నేడు, రేపు కార్యదర్శులకు శిక్షణ

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో ఎంపిక చేసిన 35 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 22, 23వ తేదీల్లో ఆర్‌టీఏ చట్టంపై శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్వో, ఎంసీహెచ్‌ఆర్‌డీ ఇన్‌చార్జ్ మేనేజర్ పద్మశ్రీ తెలిపారు. తొలి విడతగా 35 మందిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో శిక్షణ మొదలవుతుందని తెలిపారు. కాగా, మిగతా కార్యదర్శులకు సైతం విడతల వారీగా శిక్షణ ఉంటుందని డీఆర్వో వెల్లడించారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు ప్రమాదం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం, పిండిప్రోలు సబ్‌స్టేషన్ల లైన్ ఇన్‌స్పెక్టర్ గడికొప్పుల రాములు వెళ్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈదురుగాలులు, అకాల వర్షంతో ఆదివారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఎదురవగా, సమస్యను పరిష్కరించేందుకు ఆయన కారులో వెళ్తున్నారు. ఈక్రమాన తిరుమలాయపాలెం వద్ద ప్రధాన రహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు విద్యుత్ స్తంభాలకు ఢీకొని బోల్తా పడింది. రాములు గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవుల వద్ద రైతులు

కామేపల్లి: విద్యుత్ షాక్ కారణంగా రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. మండలంలోని గోవింద్రాలకు చెందిన రైతులు లకావత్ శ్రీను, బానోత్ నాగ తమ పశువులను సోమవారం మేతకు విడిచారు. అయితే, ఆదివారం రాత్రి ఈదురుగాలులతో తెగిపడిన తీగలను తాకిన ఆవులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. ఈ మేరకు అధికారులు తమకు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



రత్తయ్య (ఫైల్)

మధిర: ఎండవేడి కారణంగా వడదెబ్బకు గురైన ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని నిదానపురం గ్రామానికి చెందిన మేసిపోగు రత్తయ్య (33) సోమవారం మేకలను మేతకు తీసుకెళ్లాడు. అయితే, ఎండ కారణంగా అస్వస్థతకు గురై పొలం వద్ద పడిపోగా స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆటోలో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలోగా రత్తయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా, భార్య రమ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మధిర రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరొకరు మృతి

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స చేయిస్తుండగా మరో వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని బోదులబండ వద్ద గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న హరికిరణ్ (36), రాజ్‌బహదూర్ (22), రాంజీలాల్ (23) ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొట్టిన విషయం విదితమే. ఇందులో హరికిరణ్ ఆదివారం రాత్రి మృతి చెందగా, ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంజీలాల్ సోమవారం మృతి చెందాడు. అలాగే, రాజ్‌బహదూర్ చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

తిరుమలాయపాలెం: వరిగడ్డి వామి వేస్తున్న ఓ రైతు పాముకాటుతో మృతి చెందాడు. మండలంలోని కుక్కలతండా గ్రామానికి చెందిన గుగులోత్ కిషన్ (38) సోమవారం ఉదయం వరిగడ్డి కట్టలతో వామి వేస్తున్నాడు. ఈ క్రమాన కాలిపై పాము కాటు వేయగా.. కుటుంబీకులు మరిపెడ బంగ్లాకు, అక్కడి నుంచి ఖమ్మం తరలించగా ఆరోగ్యం విషమించి మృతి చెందాడు. కిషన్‌కు భార్య సుమలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రగ్బీలో రాణిస్తున్న అభినయశ్రీ

- సీనియర్స్ జాతీయస్థాయి జట్టుకు ఎంపిక
- గతంలో కరాటే, వాలీబాల్ పోటీల్లోనూ ప్రతిభ



చల్లగొండ్ల అభినయశ్రీ

ముదిగొండ: చిన్నతనం నుంచి ఆమెకు క్రీడలపై మక్కువ. ఓ పక్క ఆటల్లో సాధన చేస్తూనే చదువులోనూ ప్రతిభ కనబర్చడం అలవాటుగా మార్చుకుంది. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న ఆమె పలువురి మన్ననలు అందుకుంటోంది. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన చల్లగొండ్ల అభినయశ్రీ ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం కేజీబీవీలో ఇంటర్ పూర్తి చేసింది. ఆరో తరగతి నుంచి కరాటే నేర్చుకున్న ఆమె జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంది. గోవాలో నేషనల్ యూత్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన జరిగిన పోటీల్లో బంగారు పతకాలు, బ్లాక్ బెల్ట్ సాధించింది. కేజీబీవీ ప్రత్యేకాధికారి ఇందిర, సీఈటీ నిర్మల ప్రోత్సాహంతో వాలీబాల్ పోటీల్లో బంగారు పతకాలు సాధించడం విశేషం.

రగ్బీలోనూ ప్రతిభ

కరాటే, వాలీబాల్‌లోనే కాక రగ్బీపైనా అభినయశ్రీ దృష్టి సారించింది. ఈమేరకు జూనియర్స్ విభాగం నుంచి పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత హైదరాబాద్‌లో గత ఏడాది జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపికై ంది. పుణెలోని బల్లెవాడిలో గత ఏడాది జూలైలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. అలాగే, అసోం రాష్ట్రంలోని గువాహటిలో సీనియర్స్ విభాగంలో జరగనున్న జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికై న ఆమె పలువురి మన్ననలు అందుకుంటోంది.

రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి

ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు

కారేపల్లి: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వైరా నియోజకవర్గం నుంచి భారీగా శ్రేణులు, ప్రజలు తరలివచ్చేలా నాయకులు చొరవ తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధు పిలుపునిచ్చారు. కారేపల్లి క్రాస్‌లోని మాజీ వార్డు సభ్యుడు సిద్ధంశెట్టి నాగయ్య నివాసంలో సోమవారం వారు బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభకు పార్టీ శ్రేణులు, ప్రజల తరలింపు, సన్నద్ధతపై సూచనలు చేశారు. సమావేశంలో నాయకులు ముత్యాల సత్యనారాయణ, అడప పుల్లారావు, బానోతు రాందాస్, దాచేపల్లి కృష్ణారెడ్డి, మద్దెబోయిన సత్యనారాయణ, సిద్ధంశెట్టి పెద్దనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల పరిశీలకుడిగా దుర్గాప్రసాద్

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షల పర్యవేక్షణ అధికారిగా మోడల్ స్కూల్ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఉమ్మడి జిల్లాలోని పలు కేంద్రాలను సందర్శించనున్నారు. కాగా, సోమవారం పదో తరగతి పరీక్షలకు 863 మందికిగాను 761 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 748 మందికిగాను 666 మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ పాపారావు తెలిపారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)లో ఓ వివాహితపై లైంగిక దాడికి యత్నించిన అదే గ్రామవాసి ఉమ్మినేని రవిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు. ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయాన రవి లైంగిక దాడికి యత్నిస్తుండగా బాధితురాలు కేకలు వేయడంతో పరారయ్యాడు. ఈమేరకు మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి సీజ్

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి భద్రాచలం మీదుగా తరలిస్తున్న ఎండు గంజాయిని ఖమ్మం ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. కూనవరం రోడ్డులోని ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న అధికారులకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని తనిఖీ చేయగా బ్యాగులో 11 కిలోల గంజాయి లభ్యమైంది. వీరిద్దరు ఒడిశాకు చెందిన వారు దామూ హంటల్, భీమా గుట్టలుగా తేలింది. నిందితులను అరెస్ట్ చేసి, ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో భద్రాచలంలోని కొర్రాజులగుట్ట, దుమ్ముగూడెం మండలం చిన్ననల్లబల్లి, పర్ణశాల గ్రామాల్లో ఐదుగురు వ్యక్తుల నుంచి 22లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ శ్రీనివాస్ వెల్లడించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

ఖమ్మంక్రైం: ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఆన్‌లైన్‌లో డబ్బులు తీసుకుని మోసం చేసిన హైదరాబాద్ వాసిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్ సోమవారం వెల్లడించిన వివరాలు.. హైదరాబాద్‌లోని రామంతపూర్ ఇందిరానగర్‌కు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ ఎంకే తమిళగన్ ఖమ్మానికి చెందిన వ్యక్తి వద్ద రూ.9.25 లక్షలు తీసుకున్నాడు. ఆయనకు ఉద్యోగం ఇప్పించడమే కాక నగదు పెట్టుబడి పెడితే ఎక్కువ వస్తాయని ఆశ చూపిన తమిళగన్, తదితరులు వారి అకౌంట్‌లో నగదు జమ చేయించుకున్నారు. ఆ తర్వాత ఉద్యోగం రాకపోగా, డబ్బులు చెల్లించకుండా ముఖం చాటేశారు. దీంతో బాధితుడు తమను ఆశ్రయించగా విచారణ అనంతరం తమిళగన్‌ను అరెస్ట్ చేశామని ఫణీందర్ తెలిపారు. కేసు విచారణలో ఎస్‌ఐలు విజయ్ కుమార్, కృష్ణారావు, మరికొందరు ఉద్యోగులు కీలకంగా వ్యవహరించారని వెల్లడించారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన కాజా వాణికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి పరిహారంగా రూ.30 లక్షలు చెల్లించాలని ఖమ్మం ప్రొహిబిషన్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం మూడో డివిజన్ బాలాపేటకు చెందిన వల్లమూడి నాగేశ్వరరావు వద్ద వాణి 2014 జూన్‌లో రూ.40 లక్షలు అప్పుగా తీసుకుంది. ఈ అప్పు చెల్లించే క్రమాన 2016 జనవరిలో రూ.30 లక్షలకు చెక్కు జారీ చేసింది. అయితే, ఆ చెక్కును బ్యాంకులో జమ చేయగా ఆమె ఖాతా మూసివేసినట్లు చెబుతూ అధికారులు మెమో జారీ చేశారు. దీంతో నాగేశ్వరరావు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం ఆమెకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.30 లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

మరొకరికి కూడా..

ఖమ్మంలీగల్: మహబూబ్‌నగర్‌కు చెందిన కుమ్మరి శేఖర్‌కు చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.7 లక్షల పరిహారం చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లికి చెందిన వరికల వెంకటేశ్వరరావు వద్ద శేఖర్ రెండు దఫాలుగా రూ.5 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు చెల్లించే క్రమాన 2018 డిసెంబర్‌లో రూ.7 లక్షలకు చెక్కు జారీ చేశాడు. కానీ ఆయన ఖాతాలో సరిపడా నగదు లేక చెక్కు తిరస్కరణకు గురైంది. ఈ మేరకు వెంకటేశ్వరరావు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం శేఖర్‌కు జైలుశిక్ష విధించడమేకాక ఫిర్యాదికి రూ.7 లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.